# తొలి అక్షరం

చైర్మన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 01 సంచిక - 322 పేజీలు - 6 శనివారం 12 అక్టోబర్ 2024


## భారీగా పెరిగిన పసిడి ధరలు...

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 11:** పండగ వేళ హైదరాబాద్ బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. శుక్రవారం (24) క్యారెట్ల (10) గ్రాముల గోల్డ్ ధర రూ.760 పెరిగి రూ.77,400 చేరింది. (22) క్యారెట్ల (10) గ్రాముల బంగారం రేటు రూ.700 పెరిగి రూ. 70,950కి చేరుకుంది. కేజీ వెండి ధర రూ.2,000 పెరగడంతో రూ.1,02,000 పలుకుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన నగరాల్లో దాదాపు ఇవే ధరలు ఉంటాయి.








## మూసీ మురికిని ఏం చేస్తారు..?

- మూసీలో ఉన్నవారంతా పేదలే
- వారికి అండగా బిజెపి ఉంటుంది
- 370 ఆర్టికల్ ముగిసిన చరిత్ర
- మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 11:** మూసీ పరివాహక ప్రాంతాల్లో పేదోళ్ల ఇళ్లు కూల్చడాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి మరోసారి ఖండించారు. వారికి బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు ఎంతో కష్టపడి చిన్నచిన్న స్థలాలు కొనుక్కున్నారని, వారికి ప్రభుత్వమే అన్నీ అనుమతులు ఇచ్చి ఇప్పుడు కూలుస్తామని చెప్పడం దారుణమని ఆయన అన్నారు. కూల్చివేతలు అంత ఈజీ కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే స్వయంగా మూసీ ప్రాంతంలో పర్యటించి ప్రజలను ఒప్పించాలని డిమాండ్ చేశారు. మూసీ రిటర్నింగ్ వాల్ నిర్మించి కూడా సుందరీకరణ చేయెచ్చని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అన్నీ డ్రైనేజీలు మూసీలోనే కలుస్తున్నాయని, కనీసం శుద్ధి జరగకుండా

వివరాలు 2లో



# పేదలకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యం

●గురుకుల భవన నిర్మాణాలకు రేవంత్ భూమి పూజ... ●ఇందిరమ్మ కలలుగన్న రాజ్య స్థాపనకు అడుగులు ●150 కోట్లతో అధునాత స్కూల్ బిల్డింగ్స్ నిర్మాణం ●శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ వెల్లడి ●ఒకే రోజు 28 చోట్ల భూమి పూజ మహోత్సవం ●సమీకృత గురుకులాల నిర్మాణలకు శంకుస్థాపన ●షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గులో సీఎం రేవంత్ ●లక్ష్మీపురంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ●పొన్నెకల్లులో మంత్రి పొంగులేటి.. ●నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి ●హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ భూమి పూజ

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 11:** పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యతతో కూడిన విద్యను అందించాలన్న లక్ష్యంతో సమీకృత గురుకులాల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలిదశలో 28 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను తీసుకురావాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న గురుకులాలను కొనసాగిస్తూనే.. అత్యాధునిక వసతులతో సమీకృత భవనాలను నిర్మించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా కొడంగల్, మధిర, హుస్నాబాద్, నల్లగొండ, హుజూర్‌నగర్, మంథని, ములుగు, పాలేరు, ఖమ్మం, వరంగల్, కొల్లాపూర్, అందోల్, చాంద్రాయణగుట్ట, మంచిర్యాల, భూపాలపల్లి, అచ్చంపేట, స్టేషన్ ఘన్‌పూర్, తుంగతుర్తి, మునుగోడు, చెన్నూరు, షాద్‌నగర్, జడ్చర్ల, పరకాల, నారాయణఖేడ్, దేవరకద్ర, నాగర్‌కర్నూలు, మానకొండూరు, నర్సంపేటలో సమీకృత భవనాలను నిర్మించనుంది. ఇక ఈ 28 ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు శుక్రవారం భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు. **కొందుర్గులో సీఎం రేవంత్ రెడ్డి..** షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గులో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమిలేదని విమర్శించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన

వివరాలు 2లో

## కేంద్రం నుంచి నిధులు తేవడంలో విఫలం

- కాంగ్రెస్, బిజెపిలపై హరీష్ రావు ఫైర్



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 11:** తెలంగాణకు రావాల్సిన నిధుల కోసం పోరాడడంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఘోరంగా విఫలమయ్యాయని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. గోదావరి పుష్కరాలకు తెలంగాణకు కేంద్రం మొండి చెయ్యి చూపడంపై ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. గోదావరి పుష్కరాల కోసం కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కి రూ.100 కోట్ల నిధులు ఇచ్చింది.

వివరాలు 2లో

## డిఎస్పీగా క్రికెట్ సిరాజ్



### - నియామక పత్రం అందచేసిన డిజిపి

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 11:** టీమిండియా క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు ఇంటి స్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఆగస్టు నెలలో జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 78లో 600 చదరపు గజాల స్థలాన్ని సిరాజ్‌కు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా సిరాజ్‌కు డీఎస్పీ పోస్టు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ జితేందర్ సిరాజ్‌కు డీఎస్పీ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖకు సిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ

వివరాలు 2లో

## ఎస్సీ వర్గీకరణకు అడుగు

- జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ నియామకం



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 11:** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ షమీమ్ అక్తర్‌ను కమిషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని కమిషన్‌కు ప్రభుత్వం సూచించింది. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ కులాల వర్గీకరణ అమలుకు నియమించిన ఏకసభ్య కమిషన్ 60 రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని, ఆ తర్వాతే ఉద్యోగ నియామకాలకు సంబంధించి కొత్త నోటిఫికేషన్లు వేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉపకులాల వారీగా ఎస్సీల వెనుకబాటుతనాన్ని కమిషన్ అధ్యయనం చేయనుంది. ఎస్సీ వర్గీకరణ కోసం 2011 జనాభా లెకలను పరిగణనలోకి తీసుకొని, ఏకసభ్య కమిషన్ 60 రోజుల్లో నివేదిక సమర్పించాలని గడువు నిర్దేశిరచారు. కమిషన్‌కు అవసరమైన సమాచారాన్ని అన్ని విభాగాల నుంచి అందేలా చూడాలని సీఎస్‌కు సూచించారు. మంత్రివర్గ ఉప సంఘానికి అందిన వినతులపైనా సమావేశంలో చర్చించడంతో పాటు, వాటన్నింటినీ ఏకసభ్య కమిషన్‌కు అందించాలని నిర్ణయించారు. క్షేత్రస్థాయి నుంచి విజ్ఞప్తులు, ఫిర్యాదుల స్వీకరణకు ఉమ్మడి పది జిల్లాల్లో ఒకోరోజు పర్యటించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు.

## ప్రపంచంతో తెలంగాణ బిడ్డలు పోటీపడేలా విద్య



## రాష్ట్ర ప్రజలకు విజయ దశమి శుభాకాంక్షలు..



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 11:** రాష్ట్ర ప్రజలకు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజయదశమి శుభాకాం క్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ఈ విజయదశమి జరుపుకుంటామని ప్రతి ఒక్కరు ఆ దుర్గా భవాని అమ్మవారి ఆశీర్వాదంతో ఆయుఆరోగ్యలతో, సుఖ సంతోషాలతో ,సిరి సంపదలతో ఈ సంవత్సరం ప్రారంభించే అన్ని పనుల్లో విజయం సాధించాలని కోరుకున్నారు. దసరా నాడు శుభసూచకంగా పాలపిట్టను దర్శించి, షమీ వృక్షానికి పూజ చేసి , జమ్మి ఆకును బంగారంగా భావించి పెద్దలకు సమర్పించుకొని ఆశీర్వాదం తీసుకోవడం తెలంగాణలో గొప్ప సంస్కృతి సాంప్ర దాయానికి నిదర్శమని మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. ప్రతి ఒక్కరూ పెద్దల ఆశీర్వాదం తీసుకొని భవిష్యత్తులో విజయం సాధించే దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు.

## కులగణనపై సర్వే... ఉత్తర్వులు జారీ !



**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 11:** తెలంగాణలో సమగ్ర కులగణనపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కులగణన కోసం సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహిస్తామని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన అంశాలపై సర్వే నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. సర్వే బాధ్యతను ప్లానింగ్ విభాగానికి అప్పగిస్తున్నట్లు తెలిపారు. 60 రోజుల్లో సర్వే పూర్తి చేయాలని జీవోలో పేర్కొన్నారు.

## 13న అలయ్ బలయ్ కార్యక్రమం

### - ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వేదికగా కార్యక్రమం

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 11:** దసరా సందర్భంగా ఏటా నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమాన్ని 11న నిర్వహి స్తున్నామని అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్మన్ విజయలక్ష్మి తెలిపారు. దత్తాత్రేయ తనయ ఈ కార్యక్రమాన్ని నిర్వహిసు న్నారు. నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే ఈ కార్యక్ర మానికి సిఎం రేవంత్ రెడ్డి చీఫ్ గెస్ట్‌గా హాజరవుతారని ఆమె వెల్లడించారు. ఏటా అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహిస్తు న్నామన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. రాష్ట్ర ఉద్యమకారులకు, ప్రముఖులకు సన్మానం చేస్తామన్నారు. అందరూ ఆహ్వానితులేనని చెప్పారు. హర్యానా గవర్నర్‌గా ఉన్న బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఇంతకాలం నిర్వహిస్తూవచ్చారు. ఇప్పుడు ఆయన కూతురు విజయలక్ష్మి ఆ బాధ్యతలు తీసుకున్నారు.

## ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు

### - ప్రభుత్వం జీవో జారీ

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 11:** ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం జీవో జారీ చేసింది. పంచాయతీ, మున్సిపల్, వార్డు స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రామస్థాయిలో సర్పంచి లేదా ప్రత్యేక అధికారి, కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ చైర్మన్‌గా మున్సిపాలిటీ స్థాయిలో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పంచాయతీ కార్యదర్శి లేదా వార్డు ఆఫీసర్ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ కన్వీనర్‌గా ఉంటారని జీవోలో ప్రభుత్వం పేర్కొంది. ఇద్దరు ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు, ముగ్గురు స్థానికులు కమిటీలో సభ్యులుగా ఉంటారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ కొనసాగనున్న ఈ కమిటీలు.. లబ్దిదారులకు అవగాహన కల్పిస్తాయి. శనివారం నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. కమిటీల కోసం పేర్లు పంపాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం ఆదేశించింది.

## కేంద్రం నుంచి నిధులు తేవడంలో విఫలం

(మొదటి పేజీ తరువాయి)

కానీ తెలంగాణకు గుండు సున్న ఇచ్చింది. మన రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా.. ఒక్క రూపాయి కూడా కేంద్రం తెలంగాణకు ఇవ్వలేదని మండిప డ్డారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక నిధుల కింద రూ. 15 వేల కోట్లు మంజూరు కాగా.. తెలంగాణకు మాత్రం దక్కింది గుండు సున్నా అన్నారు. లోక్‌సభలో బీఆర్ఎస్ బలమైన స్థానంలో ఉండి ఉంటే.. ఈ అన్యాయాన్ని మేము ఎప్పటికీ సహించేవాళ్లం కాదన్నారు.ఎప్పటికైనా ఇంటిపార్టీ బీఆర్‌ఎస్సే తెలంగాణకు రక్షణ కవచం అన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయాలపై ఇప్పటికైనా ఆ పార్టీలు స్పందించాలని డిమాండ్ చేశారు.

# పేదలకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

విద్య అందించేందుకు 10,006 పోస్టులు డీఎస్సీ ద్వారా ఇచ్చామని చెప్పారు. ఉపాధ్యాయుల బదిలీలతో పాటు ఉద్యోగ ఉన్నతి ఇందిరమ్మ ప్రభుత్వం కల్పించిందని, గత ప్రభుత్వం అనేక స్కూల్స్ పెట్టిందే తప్ప పక్క వసతి కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. **150 కోట్లతో అధునాతమైన పాఠశాలలు..** ఇందిరమ్మ ప్రభుత్వం కులమతాలకు అతీతంగా అంతర్జాతీయ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని సీఎం రేవంత్ అన్నారు. రాష్ట్రంలో ఒక్కో నియోజకవర్గంలో 125 నుంచి 150 కోట్లతో అద్భుతమైన పాఠశాల భవనాలను నిర్మాణం చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ప్రజల నెత్తిన భారం మోపిందని సీఎం ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ?300 కోట్లతో అనేక కంపెనీలతో స్కిల్ డవలప్ మెంట్ నైపుణ్యం పెంపొందించే అవకాశం కలిపించిందన్నారు. మాటలతో కాదు ఇందిరమ్మ ప్రభుత్వం చేతలతో చేసి చూపిస్తుందని.. ప్రైవేటుకు దీటుగా పేద విద్యలకు కార్పొరేట్ విద్యానందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. **నూతన భవనాల్లో సకల సౌకర్యాలు...** ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మోడల్‌ను ఇప్పటికే ఖరారు చేశామని సీఎం రేవంత్ అన్నారు. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, తరగతి గదులు, ప్రయోగశాలలు, ఆట స్థలం, బాలబాలికలకు వేర్వేరు హాస్టళ్లు, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ సిబ్బందికి నివాస సముదాయాలు ఏర్పాటు చేసేలా నమూనా రూపొందించామన్నారు. తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, యాంప్ థియేటర్ వంటి అధునాత సౌకర్యాలు కల్పిస్తామన్నారు. విద్యార్థుల మానసిక ఉల్లాసం కోసం క్రికెట్ గ్రౌండ్, ఫుట్‌బాల్ కోర్టు, బాస్కెట్‌బాల్, వాలీబాల్, టెన్నిస్ కోర్టులతోపాటు ఔట్‌డోర్ జిమ్, ఓపెన్ ఎయిర్ థియేటర్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం తెలిపారు. **లక్ష్మీపురంలో భట్టి విక్రమార్క ..** మధిర నియోజకవర్గం బోనకల్ లక్ష్మీపురం గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరికీ ప్రయోజనకరంగా ఉండే విధంగా ఒకే చోట అన్ని రకాల విద్యను అందించడమే ఈ గురుకులాల లక్ష్యం అన్నారు. పేదలకు ఈ స్కూల్స్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని పేర్కొన్నారు. **పొన్నెకల్లులో మంత్రి పొంగులేటి..** రాష్ట్ర వ్యాప్తంగా 28 ఇంటిగ్రేటెడ్ స్కూళ్ళకు శంకుస్థాపన చేసుకుంటున్నామని, పేదల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, విద్య వైద్యానికి ఇందిరమ్మ ప్రభుత్వం పెద్దపీట వేసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలం, పొన్నెకల్‌లో నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం అమ్మ ఆదర్శ పథకంతో ?657 కోట్లతో ప్రభుత్వం వచ్చిన మూడునెల్లోనే చేపట్టి సౌకర్యాలు కల్పించిందని చెప్పారు. **నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి..** నల్లగొండలో ఇంటిగ్రేటెడ్ స్కూ భవనానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో ప్రతి విద్యార్థికి విద్య అందిస్తామని చెప్పారు. ప్రైవేటు స్కూళ్లు మూతపడేలా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.**హుస్నాబాద్లో మంత్రి పొన్నం..** అంతర్జాతీయ స్థాయిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ హుస్నాబాద్ రావడంతో నియోజకవర్గం విద్యా రంగంలో మరింత ముందుకు పోతుందని, తన నియోజకవర్గం ఎడ్యుకేషన్ హబ్‌గా మారాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలంలో తంగలపల్లి గ్రామంలో రెసిడెన్షియల్ పాఠశాల కాంప్లెక్స్‌కు భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థి నాయకుడిగా మీ అందరి ఆశీర్వాదంతో హుస్నాబాద్ ఎమ్మెల్యే అయి మంత్రి అయ్యానన్నారు.. నాలుగు గురుకులాలు ఒకే కాంప్లెక్స్‌గా విద్యను అంతర్జాతీయ స్థాయిలో తీసుకుపోవడానికి ఏర్పాటు చేస్తున్నామన్నారు..నాలుగో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఇక్కడే చదువుకునేలా భవనాల నిర్మాణం జరుగుతుందని చెప్పారు.

# మూసీ మురికిని ఏం చేస్తారు

(మొదటి పేజీ తరువాయి)

నేరుగా నదిలోనే మురుగునీరు కలుస్తోందని ఆయన చెప్పారు. గంగా నదిపై కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ఖర్చుతో శుద్ధి చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మూసీ సుందరీకరణకు రూ.1.50లక్షల కోట్లు అవసరం లేదని స్పష్టం చేశారు. రేస్ కోర్స్ స్థలం అమ్మేసి మరీ సుందరీకరణ చేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ఎ÷-లాన్ లేకుండా ఇళ్లు కూల్చివేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. సీఎం దుందుడుకుగా వ్యవహరిస్తానంటే కుదరదని కేంద మంత్రి హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇలాగే ప్రజలపై బెదిరింపులకు పాల్పడిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాకు గవర్నర్ చట్టబద్ధత కల్పించడం సాధారణ పక్రియ అని, బాధితులు ఎవరూ భయపడొద్దని చెప్పారు. మూసీ బాధితుల కోసం బీజేపీ పోరాటం చేస్తోందని ఆయన మరోసారి చెప్పుకొచ్చారు. ప్రజలు బలహీనులు కాదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైడ్రా అంటే భూతం కాదని, గతంలోనూ అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం కూల్చేదని ఆయన చెప్పారు. అయితే ప్రస్తుతం దాని పేరును మార్చారని, అదే హైడ్రా అని చెప్పారు. హైడ్రా ముందుగా మూసీ నదిలో ఉన్న బస్ డిపో, మెట్రో పిల్లర్స్‌ను కూల్చాలని కేంద్ర మంత్రి డిమాండ్ చేశారు. వాటిని కూల్చకుండా ముందుగా పేదవారి ఇళ్లు ఎలా పడకొడతారంటూ ఆయన ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలోకి వెళ్లి అభిప్రాయాలు తెలుసుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి రావాలని డిమాండ్ చేశారు. మూసీలో కలిసే మురుగునీరు ఏం చేస్తారో ముందు సమాధానం చెప్పాలని సీఎంను డిమాండ్ చేశారు. నగరంలోని అన్ని ప్రాంతాల మురుగు నీరు వచ్చి మూసీలోనే కలుస్తోందని తెలిపారు. దీనిపై సీఎం ముందుగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు తనను సంప్రదించారని వస్తున్న వార్తలను కిషన్ రెడ్డి ఖండించారు. తనను ఇప్పటివరకూ ఎవరూ సంప్రదించలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మూసీ పరివాహక ప్రాంతాల్లో నిర్మాణాలు వెలిశాయని.. 40ఏళు గా అక్కడ నివాసం ఉంటున్న వాళ్లకు రాష్ట్ర ప్రభుత్వమే అన్ని వసతులు కల్పించాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో కిషన్ రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ధనవంతులు ఎవరూ లేరు. పేద ప్రజల ఇళ్లను కూల్చేముందు వాళ్లతో చర్చించిన తర్వాతే ముందుకు వెళ్లాలి. డ్రైనేజీ వ్యవస్థ అంతా మూసీలోనే కలుస్తోంది.. దానికి ప్రత్యామ్నాయం లేకుండా మూసీ సుందరీకరణ ఎలా సాధ్యమవుతుంది? రూ.లక్షన్నర కోట్లతో సుందరీకరణ చేస్తామంటున్న ప్రభుత్వం.. అ నిధులను ఎక్కడి నుంచి సమీకరిస్తుంది? కూల్చివేతల విషయంలో హైడ్రా తొందరపా టు నిర్ణయాలు తీసుకోవడం తగదు. సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తే బ్యాంకు రుణాలు ఎవరు చెల్లిస్తారఅని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.ఈ సందర్భంగా జమ్మూకాశ్మీర్ ఎన్నికలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 98శాతం హిందువుల ఓట్లు తమకే వచ్చాయని కిషన్ రెడ్డి చెప్పారు. కశ్మీరీ పండిట్లు మొత్తం తమకే ఓట్లు వేశారని చెప్పారు. ఆర్టికల్ 370రద్దు ఓ చరిత్ర అని, దాన్ని తిరిగి తీసికొని వచ్చే అవకాశమే లేదన్నారు. చిన్న ఘటనకూడా చోటు చేసుకోకుండా 60 శాతం ఓటింగ్ జరిగిందని ఆయన చెప్పారు. ఫేక్ నోట్లు నియంత్రించామని, టెర్రరిజాన్ని అరికట్టగలిగామని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఐఎస్ఐపై కఠిన చర్యల కారణంగానే ఇదంతా జరిగిందని కేంద్ర మంత్రి చెప్పారు. జార్ఖండ్‌లో జరిగే ఎన్నికల్లోనూ తామే గెలవబోతున్నట్లు ఆశాభా వం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌ను ప్రపంచ దేశాల ముందు దోషిగా నిలబెట్టామని, చైనా ఆహారం, ఆయుధాలు పాకిస్థాన్‌కు ఇస్తోందని మండిపడ్డారు. కాశ్మీర్‌లో పాక్ ఆటలు ఇకపై సాగనివ్వమని కిషన్ రెడ్డి హెచ్చరించారు. అర్టికల్ 370 విషయంలో పునరాలోచన లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తేల్చి చెప్పారు. పదేళ్ల భాజపా పాలనలో భారతదేశం అంతర్జాతీయంగా బలపడుతోందన్నారు.

## నిరుద్యోగులకు ప్రభుత్వం దసరా కానుక

### - ఆరోగ్య శాఖలో మరో 371 పోస్టులకు నోటిఫికేషన్

**తొలి అక్షరం/హైదరాబాద్,అక్టోబర్ 11:** నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక ప్రకటించింది. ఆరోగ్య శాఖలో మరో 371 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 271 నర్సింగ్ ఆఫీసర్, 99 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీకి సంబంధించి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. రేవంత్ సర్కార్ ఇప్పటికే 7,300 పోస్టులను భర్తీ చేసింది. మరో 6,500 పోస్టుల భర్తీ పక్రియ కొనసాగుతోంది. తాజాగా మరో 272 నర్సింగ్ ఆఫీసర్(స్టాఫ్ నర్స్), 99 ఫార్మసిస్ట్(గ్రేడ్ 2) పోస్టుల భర్తీ చేపట్టేందుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించి శుక్రవారం నాడు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. తాజాగా ప్రకటనతో మొత్తం పోస్టుల సంఖ్య 732కు పెరిగింది. అక్టోబర్ 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తు చేసేందుకు గడువు ఇచ్చింది. నవంబర్ 30వ తేదీన రాత పరీక్ష నిర్వహించ నున్నారు. గత నెలలో విడుదల చేసిన ఫార్మసిస్ట్, నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌కి అనుబంధంగా ఈ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు బోర్డు తెలిపింది. గత నెలలో 2,050 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు ఇచ్చిన నోటిఫికేషన్‌కు ఇప్పుడు అదనంగా మరో 272 పోస్టులను జతచేసింది. దీనితో మొత్తం భర్తీ చేయనున్న నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు 2,322కి చేరాయి. ఈ నెల 14లోగా నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాని బోర్డు సూచించింది. నవంబర్ 17న కంప్యూటర్ విధానంలో పరీక్ష నిర్వహించ నున్నట్లు పేర్కొంది. అదేవిధంగా గతంలో ప్రకటించిన 633 ఫార్మసిస్ట్ పోస్టులకు అదనంగా మరో 99 పోస్టులను కలుపుతూ తాజాగా మరో నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో మొత్తం ఫార్మసిస్ట్ పోస్టుల సంఖ్య 732కి చేరింది. ఫార్మసిస్ట్ పోస్టులకు సంబంధించి ఈ నెల 21 వరకు దరఖాస్తులు స్వీకరించి నవంబర్ 30న పరీక్ష నిర్వహిస్తామని బోర్డు ప్రకటించింది.

# డిఎస్పీగా క్రికెట్ సిరాజ్

(మొదటి పేజీ తరువాయి)

క్రికెట్ భారత దేశానికి, మన తెలంగాణకు గొప్ప పేరు, గౌరవాన్ని తెచ్చాడంటూ మొహమ్మద్ సిరాజ్‌ను సీఎం అభినందించారు. టీ20 వరల్డ్ కప్‌ను గెలిచిన అనంతరం హైదరాబాద్‌కు చేరిన సిరాజ్ మంగళవారం ఉదయం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సిరాజ్‌ను సీఎం ఘనంగా సన్మానించారు. సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్‌లో తన అద్భుతమైన ప్రతిభను ప్రదర్శిస్తున్నాడని, అందుకే ఈ రోజు అత్యున్నత స్థాయి క్రికెటర్లలో ఒకడిగా పేరు సంపాధించాడని సీఎం ప్రశంసించారు.భారత ప్లేయర్‌గా ఏడేండ్లుగా సేవలు అందిస్తుండటమేకాక, ఐసీసీ టీ20 వరల్డ్ కప్ టీమిండియా గెలుపు బృందంలో సిరాజ్ ఉన్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో అడుగుపెట్టిన సిరాజ్‌కు హైదరాబాద్‌లో క్రికెట్ అభిమానులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సిరాజ్‌ను సన్మానించింది.

# ప్రపంచంతో తెలంగాణ బిడ్డలు పోటీపడేలా విద్య

### - ఎంత ఖర్చయినా వెనక్కి తగ్గే ప్రసక్తి లేదు

### - రఘునాథపాలెంలో స్కూల్ శంకుస్థాపనలో మంత్రి తుమ్మల



**తొలి అక్షరం/ఖమ్మం:అక్టోబర్ 11:**ప్రపంచంతో తెలంగాణ బిడ్డలు పోటీపడేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్'కు శ్రీకారం చుట్టారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎంత ఖర్చయినా సీఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో నాణ్యమైన విద్య అందించేందుకు ఈ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు మంత్రి తుమ్మల శు క్రవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 'ఒక్కో పాఠశాలకు రూ.350కోట్ల వరకూ ఖర్చు చేసి భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేడెట్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నాం. మె?దటి విడత కింద నేడు 28 నియోజకవర్గాల్లో రూ.5వేల కోట్లతో పాఠశాలలకు శంకుస్థాపన చేశాం. రఘునాథపాలెం వద్ద అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన స్వామినారాయణ ట్రష్టు స్కూల్ ఏర్పాటు చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తోపాటు స్వామి నారాయణ ట్రస్ట్ స్కూల్ వల్ల మండల ఖ్యాతి పెరుగుతుంది. ఖమ్మం నగరంలో రానున్న రోజుల్లో ఇస్కాన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేస్తాం అన్నారు. పేదరికం నుంచి ప్రజలు శాశ్వతంగా బయటపడాలంటే మణులు, మాణిక్యాలు అవసరం లేదు. ఒక్క విద్య ఉంటే చాలు. మన దేశ బలం మనకున్న యువతే. ఇటీవల వారు గంజాయి మహమ్మారికి అలవాటు పడుతున్నారు. పిల్లలపై పాఠశాల నిర్వాహకులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. డ్రగ్స్ బాధిత కుంటుంబాల కడుపుకోత తీర్చలేనిది. గంజాయి, డ్రగ్స్‌పై సీఎం రేవంత్ సర్కార్ ఉక్కుపాదం మోపుతోంది. ఇందిరమ్మ రాజ్యంతోనే సంక్షేమ రాజ్యం సాధ్యమని ముందే చెప్పాం. రూ.18వేల కోట్లతో రైతు రుణమాఫీ చేశాం. రెండు లక్షలపైన రుణం ఉన్న రైతులకూ మాఫీ చేస్తాం. పిల్లల చదువు, రైతులకు భరోసాతో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన సాగుతోందని అన్నారు.

# రక్తదానంతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న ఎస్ రాజేశ్వర్ రావు

- రక్తదానంతో సమాజానికి సేవచేసే మార్గం
- సమయానికి రక్తం అందుబాటులో వుండేలా చూద్దాం
- 44 పర్యాయాలు రక్త దానం చేసిన రాజేశ్వర్ రావు



మాజీ మంత్రి ఇంద్ర కరణ్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న దృశ్యం (ఫైల్ ఫోటో)



రక్త దానం చేస్తున్న రాజేశ్వర్ రావు



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి (పి. సైదులు),అక్టోబర్11:** రక్తదానమనేది ప్రాణాలను కాపాడుతుంది.రక్తదానంపై అవగాహన పెంచుదాం అవసరమైనవారికి సమయానికి రక్తం అందుబాటులో వుండేలా చూద్దామని నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఎస్ రాజేశ్వర్ రావు పిలుపునిచ్చారు.ప్రమాదాలు సంభవించి సకాలంలో రక్తం లభించక ప్రాణాలు పోతున్న నేటి రోజుల్లో అవసరం ఉందన్న సమాచారం అందితే చాలు ముందుకు వచ్చి రక్తదానం చేస్తున్నారు.నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఎస్ రాజేశ్వర్ రావు.ఉపాధ్యాయునిగా పని చేస్తున్న ఈయన పాత్రికేయునిగా కూడా పని చేస్తున్నారు. దాదాపు ఇరవై ఏళ్ల క్రితం అత్యవసర పరిస్థితుల్లో తన మిత్రుడొకరు రక్తం లభించక ఇబ్బంది పడ్డారు.ఈ పరిస్థితిని గమనించిన ఆయన అప్పట్నుంచి రక్తదానానికి శ్రీకారం చుట్టారు.అరుదైన ఏ నెగెటివ్ గ్రూప్ రక్తం ఈయనది.అవసరం ఉందని సమాచారం అందితే చాలు,అక్కడికి వెళ్లి రక్తదానం చేసి వస్తారు. తాను ఇవ్వటమే కాదు.రక్త దాతల వివరాలు కూడా నమోదు చేస్తారు.ఇప్పటి వరకు ఆయన 44 పర్యాయాలు రక్త దానం చేశారు.గత పదమూడేళ్ళుగా ఫ్రెండ్స్ టు సపోర్ట్ అనే రక్తదాతల సంస్థకు ఉమ్మడి ఆదిలాబాద్ కో ఆర్డినేటర్ గా కొనసాగుతున్నారు. ఇప్పటికే పలు స్వచ్ఛంద సంస్థలు,లయన్స్ క్లబ్ వంటి సంస్థలు ఆయన సేవలకు గుర్తింపుగా సత్కరించాయి. అర్థరాత్రి అవసరమై రక్తం కావాలన్నా రక్తదాతల ఫోన్ నెంబర్లను అందిస్తూ అత్యవసర పరిస్థితుల్లో ప్రాణదానం చేస్తున్నారు.రక్తదానం గురించి మాట్లాడుతూ రక్త దానం వల్ల ఎలాంటి ఇబ్బందులూ లేవన్నారు.ప్రతి మూడు మాసాలకో సారి దానం చేయవచ్చని తెలిపారు.ఒక యూనిట్ రక్తంతో ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు.అత్యవసర స్థితిలో ఉన్న రోగికి రక్తం అవసరం ఉంటుంది.రోడ్డు ప్రమాద ఘటనల్లో గాయపడి సకాలంలో రక్తం అందక చనిపోయినవారు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు.నేటికీ రక్తదానంపై చాలామందికి సరైన అవగాహన లేదు.రక్తదానం చేస్తే నీరసించిపోతామని,బలహీనపడిపోతామనే అపోహ ప్రజల్లో ఉంది.యువత రక్తదానం అంటేనే వెనకడుగు వేస్తున్నారు.స్వచ్ఛందంగా రక్తదానం చేసేవారికి ప్రభుత్వం,స్వచ్ఛంద సంస్థల నుంచి ప్రోత్సాహం అవసరం అని నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఎస్ రాజేశ్వర్ రావు పేర్కొన్నారు.

## జనసేన పార్టీ మండల అధ్యక్షులు దేశెట్టి వెంకటేష్



**తొలి అక్షరం/పెద్దవంగర, అక్టోబర్ 11:** పెద్దవంగర మండలంలోని జనసేన పార్టీ నూతన కమిటీని పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ వెల్తూరి నగేష్ సలహాదారుడు పల్లెర్ల రమేష్ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది జనసేన పార్టీ మండల అధ్యక్షుడిగా దేశెట్టి వెంకటేష్ ప్రధాన కార్యదర్శిగా కసరబోయిన రాజశేఖర్ ఉపాధ్యక్షుడిగా గడ్డల అశోక్, నారబోయిన రజనీకాంత్ సలహాదారుడిగా మొగలగాని శ్రీనివాస్ మండల యూత్ అధ్యక్షుడిగా పి మహేష్ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ గా ఆవుల రమేష్ ను ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల అన్ని గ్రామాల జనసైనికులు కార్యకర్తలు పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొనడం జరిగింది, నియోజకవర్గ ఇన్చార్జి నగేష్ మాట్లాడుతూ రానున్న రోజులలో పాలకుర్తి నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో జనసేన పార్టీ సిద్ధాంతాలను అధినేత ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో సందీప్ గౌతమ్. యశ్వంత్. దేవేందర్. అఖిల్.సందీప్. మహేష్. వంశీ. అనిల్. తదితరులు పాల్గొన్నారు.

## పోయిన సెల్ ఫోన్ అప్పగింత..



**తొలి అక్షరం/నర్సింహులపేట అక్టోబర్ 11:** సెల్ ఫోన్‌ను పోగొట్టున్న సంఘటనలో నర్సింహులపేట పోలీసులు 24 గంటల్లో పట్టుకుని బాధితునికి అప్పగించినట్లు ఎస్ఐ సురేష్ శుక్రవారం తెలిపారు.ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.తొర్రుర్ పట్టణానికి చెందిన ఎండి పాషా ఫోన్ పోగొట్టుకున్నాడు.దీంతో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.ఫోను ట్రాక్ చేసిన పోలీసులు పకీర తండాలో మొబైల్ ఫోన్ ను కనుగొన్నారు.ఎస్సై సురేష్ బాధితునికి సమాచారం అందించి ఫోన్ ను ఇవ్వడం జరిగింది.టెక్నాలజీని ఉపయోగించి తన ఫోన్ ను అప్పగించినందుకు ఎస్ఐ సురేష్,కానిస్టేబుల్ విజయ్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## అనాధ పిల్లలకు నిత్యావసర సామాగ్రి బుక్స్ పంపిణీ



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో(సాంబ),అక్టోబర్11:** తొర్రూర్ పట్టణ కేంద్రంలోని నితిన్ ఫౌండేషన్ లో అనాధ పిల్లలకు కిన్నెర సంతోష్ రాజు తండ్రి గురవయ్య ల ఆధ్వర్యంలో నవరాత్రుల నవమి సందర్భంగా వారికి బియ్యం,పప్పు,చక్కెర,నూనె, పెన్నులు,పెన్సిల్లు,టవల్స్ పంపిణీ చేయడం జరిగింది.

## భారత దేశం గొప్ప ఆణిముత్యాన్ని కోల్పోయింది

### - టీసీసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 11 :** భారత దేశం నేడు గొప్ప నాయకుడిని ఆణిముత్యం కోల్పోయిందని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్(టీసీసీ) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ అన్నారు. రతన్ టాటా మృతి పట్ల శ్రద్ధాంజలి ఘటిస్తూ రతన్ టాటా కేవలం వ్యాపార చిహ్నం మాత్రమే కాదు దయ, ప్రేమ, కరుణ, స్నేహశీలత, సమగ్రతకు చిహ్నం అని, పారిశ్రామికంగా తాను ఎదుగుతూ దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని దేశ ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా ఉండాలని దేశభక్తిని చాటుకున్నారని అన్నారు. దుర్గా సెక్యూరిటీ, మ్యాన్ పవర్ కన్సల్టెంట్ రాష్ట్ర చైర్మన్ బండారి దయానంద్ యాదవ్ మాట్లాడుతూ దేశానికి నష్టం వస్తే నా యావత్ ఆస్తిని ఇవ్వడానికి సిద్ధమని ప్రకటన చేసిన వ్యక్తి అని, అసలు సిసలైన అచంచల దేశభక్తుడు రతన్ టాటా అని కొనియాడారు. డాక్టర్ కె.ఆర్.కె.మూర్తి, టీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పడగ చందర్ ముదిరాజ్, తదితరులు రతన్ టాటాకు శ్రద్ధాంజలి ఘటించారు.

## తెలుగు ప్రజలకు విజయ దశమి (దసరా) శుభాకాంక్షలు

### - మహబూబాబాద్ జిల్లా డిపిఎల్ఓ కనకదుర్గ



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),అక్టోబర్11:** విజయాలను చేకూర్చు విజయ దుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ సకల సౌభాగ్యాలతో ఉండాలని సుఖ సంతోషాలతో పండుగను జరుపుకోవాలని విజయానికి ప్రతీక దసరా పండుగ,సంకల్పాన్ని నెరవేర్చుకునే శక్తి ఆ అమ్మవారు మనందరికీ అనుగ్రహించాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ తెలుగు ప్రజలకు విజయ దశమి (దసరా) శుభాకాంక్షలు.

## రాష్ట్ర ప్రజలకు విజయ దశమి శుభాకాంక్షలు

### - తొలి అక్షరం ఎడిటర్ డాక్టర్ పస్తం సైదులు



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి (పి.సైదులు), అక్టోబర్11:** చెడు ఎంత శక్తివంతంగా కనిపిస్తున్నప్పటికీ మంచి తనమే చివరికి విజయం సాధిస్తు ఒది. ఇదే దసరా మనకి గుర్తుచే స్తుంది. అసత్యంపై సత్యం సాధించిన విజయాన్ని వేడుక చేసుకునే సమయమే ఈ దసరా ప్రజలందరి జీవితం సత్యం ధర్మంతో నిండి ఉండా లని కోరు కుంటూ అందరికీ దసరా శుభాకాంక్షలు

## మెదక్ జిల్లాలో అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

**తొలి అక్షరం/హైదరాబాద్, అక్టోబర్ 11 :** దేవాలయాలలో దొంగతనాలు చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. మెదక్ జిల్లాలోని నాగిరెడ్డి పేట్, హవేలీ ఘనపూర్, చిన్న శంకరంపేట్, చేగుంటలోని ఆలయాల్లో గత నెలలో నాలుగు దొంగతనాలు జరిగాయని చెప్పారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు వేగవంతం చేశామని, చిన్న శంకరంపేట (మం) గవ్వలపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కొందరు అనుమానస్పదంగా టాటామంజా కారులో తప్పించుకొనే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు.వారిని చాకచక్యంగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. పట్టుబడిన ముఠాలో మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన అస్లాం, షేక్ ఇలియాస్, షేక్ సమీర్‌గా గుర్తించమని ఆ ముగ్గురు పాత నేరస్థులే అని ఎస్పీ తెలిపారు. అంతరాష్ట ముఠా నుంచి మూడు సెల్ ఫోన్‌లు, ఒక కారు, ఐదు లక్షల 50 వేల రూపాయల విలువచేసే బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నమని ఎస్పీ వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. దొంగల ముఠాను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందనందించారు.



## ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించిన రైతు బిడ్డ, విద్యార్థిని...



**తొలి అక్షరం/కరీంనగర్ జిల్లా, అక్టోబర్ 11:** బహదూర్ ఖాన్ పేట కు చెందిన ఒక రైతు కుటుంబం అయినటువంటి గుర్రం లక్ష్మి, రవీందర్ రెడ్డి కు ఏకైక సంతానం అయినటువంటి గుర్రం సబిత గెజిటెడ్ ఉద్యోగంకు ఎంపిక అయినారు. వీరి కుటుంబం వ్యవసాయ ఆధారిత కుటుంబం. తల్లి తండ్రులు ఇద్దరు నిరక్షరాస్యులు, తమ కూతురు వారి లాగా కాకూడదని వారు నిరంతరం శ్రమించి ఉన్నత చదువులు చదివించారు. దానికి ఫలితంగా కూతురు గెజిటెడ్ ఉద్యోగం పొంది తల్లితండ్రులను గర్వపడేలా చేసింది. కరీంనగర్ కు (15) కిలో మీటర్ లో తమ ఊరు ఉన్నపడికి బాల్యంలో రోడ్లు మరియు బస్సు సౌకర్యం సరిగ్గా లేకపోవడం వల్ల ఐదవ తరగతి నుండే కరీంనగర్ లో సిద్ధార్థ హై స్కూల్ లో హాస్టల్ లో ఉండి పదవ తరగతి (2013)లో చేశారు. తర్వాత ఇంటర్మీడియట్, బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి గేట్ ఎగ్జామ్ లో మంచి ర్యాంక్ తెచ్చుకొని ఒస్మానియా యూనివర్సిటీ లో ఎంటెక్ చేశారు. గత ఏడాది లో విడుదల అయిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ( గెజిటెడ్ కొలువు ) ఎగ్జామ్ లో బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఎనమిదివ ర్యాంక్ సాధించి రహదారులు మరియు భవనాల (ఆర్ అండ్ బి)శాఖలో జగిత్యాల డివిజన్ ఆఫీసులో ఈ నెల ఏడున విధుల్లో చేరినారు. గత ఏడాది లో విడుదల అయిన ఏఈ ఎగ్జామ్ లో రాష్ట్ర స్థాయిలో (330) ర్యాంక్, పాలిటెక్నిక్ లెక్చరర్ ఎగ్జామ్ లో రాష్ట్ర స్థాయిలో (260) ర్యాంక్, టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఆఫీసర్‌లో (184) ర్యాంక్ సాధించారు. ఇలా నాలుగు ఉద్యోగాలు సాధించారు.వీటికి సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. ప్రస్తుతం ఏఈఈ ఆర్ అండ్ బి శాఖ జగిత్యాల డివిజన్ ఆఫీస్ లో విధుల్లో చేరినారు. తమ ఊరికి సరిగ్గా రోడ్లు, ట్రాన్స్పోర్టేషన్ లేకపోవడం వల్ల తాను బాల్యం నుండే హాస్టల్ లో ఉండి చదువుకోవలసి వచ్చింది.అటువంటి పరిస్థితి మరియు కష్టం ఎవరికి రాకుండా, ఎవరైనా ఉన్నత విద్య వరకు వారి ఊరి నుండి వెళ్లి చదువుకునే విధంగా రహదారులు నిర్మించే విధంగా తన విధులను నిర్వహించడానికి సబిత ఆస్తకి చూపుతున్నారు. తల్లి తండ్రులు వారి కష్టానికి ఫలితం లభించి వారి పేరు నిలబెట్టినందుకు తమకు ఎంతో సంతోషంగా మరియు గర్వకారణంగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రయోగాలకు సిద్ధమైన సూర్యకుమార్

**- మూడో టీ20లో కీలక మార్పులు చేసే అవకాశం**



భారత్, బంగ్లాదేశ్ మధ్య టీ20 ఇంటర్నేషనల్ సిరీస్‌లో చివరి మ్యాచ్ హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. ఈ మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ ప్లేయింగ్-11లో కొన్ని మార్పులు చేయవచ్చు. భారత్ వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచి సిరీస్‌ని కైవసం చేసుకుంది. ఇప్పుడు బంగ్లాదేశ్‌ను క్లీన్‌స్వీప్ చేయడంపైనే ఆ జట్టు దృష్టి ఉంది. భారత్ సిరీస్‌ని చేజిక్కించుకుంది. కాబట్టి సూర్యకుమార్ కొన్ని ప్రయోగాలు చేసేందుకు సిద్ధమయ్యాడు. మూడో టీ20 మ్యాచ్‌లో వికెట్‌కీపర్ బ్యాట్స్‌మెన్ సంజూ శాంసన్‌ను తొలగించవచ్చు. సంజూ శాంసన్ ఈ సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో బ్యాటింగ్ చేశాడు. కానీ, భారీ ఇన్నింగ్స్ ఆడడంలో విజయం సాధించలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో 29 పరుగులు చేసి అవుటయ్యాడు. అదే సమయంలో రెండో టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లో శాంసన్ 10 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ శాంసన్ ఓపెనర్‌గా వచ్చాడు. ఇటువంటి పరిస్థితిలో, అతన్ని చివరి మ్యాచ్‌లో ప్లేయింగ్ -11 నుంచి తొలగించవచ్చు. అతని స్థానంలో జితేష్ శర్మకు అవకాశం లభించవచ్చు అని తెలుస్తోంది. యువ ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా ఈ మ్యాచ్‌లో అరంగేట్రం చేయవచ్చు. అర్షదీప్ సింగ్ స్థానంలో అతనికి ప్లేయింగ్-11లో అవకాశం ఇవ్వవచ్చు. చివరి మ్యాచ్‌లో అర్షదీప్‌కు విశ్రాంతి ఇవ్వవచ్చు. మయాంక్ యాదవ్ ఇప్పటివరకు కేవలం 2 టీ20 మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. అతనికి విశ్రాంతి ఇవ్వకపోవచ్చు. ఇది కాకుండా, వరుణ్ చక్రవర్తికి విశ్రాంతి ఇవ్వబడుతుందని భావించలేదు. ఎందుకంటే, అతను మూడేళ్ల తర్వాత జట్టులోకి తిరిగి వచ్చిన తర్వాత అద్భుతంగా ప్రదర్శన ఇచ్చాడు. ప్లేయింగ్ ఎలెవన్‌లో మార్పు ఉండవచ్చు. వాషింగ్టన్ సుందర్‌కు విశ్రాంతి లభించవచ్చు. అతని స్థానంలో ఇప్పటి వరకు బెంచ్‌లో ఉన్న తిలక్ వర్మను తీసుకోవచ్చు. నితీష్ రెడ్డి, హార్దిక్ పాండ్యా, రియాన్ పరాగ్ జట్టులో కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది.**భారత్ ప్రాబబుల్ ప్లేయింగ్-11..**అభిషేక్ శర్మ, నితీష్ రెడ్డి, సూర్యకుమార్ యాదవ్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), రింకు సింగ్, హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ, ర్యాన్ పరాగ్, వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా, మయాంక్ యాదవ్.

# తొలి టి20లో నితీశ్‌కు తుది జట్టులో చోటు



ఆడింది ఒకే ఒక్క ఐపీల్ సీజన్.. కానీ అదరగొట్టాడు.. ఆడుతున్నది రెండో అంతర్జాతీయ మ్యాచే.. కానీ దుమ్మరేపాడు.. టి20ల్లో బంతిని ఎలా కొట్టాలో చూపుతూ.. ఇన్నింగ్స్ గేర్ ఎలా మార్చాలో చెబుతూ.. చెలరేగిపోయాడు. ఇదంతా తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి గురించి. కేవలం 21 ఏళ్లున్న ఈ కుర్రాడు బంగ్లాదేశ్ తో జరిగిన రెండో టి20లో ఎలాంటి బాదుడు బాదాడో అందరూ చూశారు. ఏడు సిక్సర్లతో విధ్వంసాన్ని రుచి చూపించాడు. ఏమాత్రం బెరుకు లేకుండా కళ్లు చెదిరే షాట్లతో బౌలర్లను బెంబేలెత్తించాడు. అటు అభిమానులను ఉర్రూతలూగించాడు. కుదురుకోవడానికి కొంత సమయం తీసుకున్నా.. బాదుడు మొదలెట్టాక తగ్గలేదు. అన్నీ చక్కటి క్రికెటింగ్ షాట్లే. అన్నీరకరకాల షాట్లే. నితీశ్ కుమార్ రెడ్డి 2024 ఐపీఎల్ సీజన్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ తరఫున మంచి ప్రదర్శన చేశాడు. దీంతో ఆ వెంటనే జింబాబ్వే టూర్ కు ఎంపిక చేశారు. కానీ, గాయం కారణంగా ఆడలేకపోయాడు. అలా అప్పుడు మిస్ అయిన లక్.. ఇప్పుడు తన్నుకుంటూ వచ్చింది. బంగ్లాదేశ్ తో మూడు టి20ల సిరీస్ కు ప్రకటించిన జట్టులో నితీశ్ ఉన్నాడు. కానీ.. కూర్పు కారణంగా తుది జట్టులో ఆడించడం కష్టమే అయింది. ఇంతలో అనుకోని విధంగా ఆల్ రౌండర్ శివమ్ దూబె గాయపడ్డాడు. అతడి స్థానంలో మరో తెలుగు క్రికెటర్ తిలక్ వర్మకు చోటు దక్కినా.. అతడు జట్టుతో చేరేసరికి టైం పట్టింది. ఈ నేపథ్యంలోనే తొలి టి20లో నితీశ్ కు తుది జట్టులో చోటు దొరికింది. ఆ మ్యాచ్ లో మెరుగ్గా ఆడడంతో రెండో మ్యాచ్ లోనూ అవకాశం ఇచ్చారు.రెండో టి20లో నితీశ్ స్థానంలో తిలక్ వర్మను ఆడిస్తారని అందరూ భావించారు. జట్టు మేనేజ్ మెంట్ విన్నింగ్ ఎలెవెన్ ను మార్చకూడదని భావించిందో ఏమో..? నితీశ్ కు మరో అవకాశం ఇచ్చింది. దీనిని అతడు రెండు చేతులా సద్వినియోగం చేసుకున్నాడు. నమ్మకాన్ని నిలబెట్టాడు. కాగా, రియాన్ పరాగ్, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్ వంటి ఆటగాళు ఉన్నప్పటికీ నితీశ్ ను అత్యంత కీలకమైన నాలుగో స్థానంలో బ్యాటింగ్ కు పంపింది టీమ్ మేనేజ్ మెంట్. అతడు దీనికి సంపూర్ణ న్యాయం చేశాడు. జట్టులో గొప్ప బ్యాటర్ ఆడే స్థానంలో బ్యాటింగ్ దిగినా ఒత్తిడికి గురికాలేదు. ఇక నితీశ్ బ్యాటింగ్ పై ఎంత చెప్పినా తక్కువే. బంగ్లా సీనియర్ ఆటగాడు మహ్మదుల్లా బౌలింగ్ లో లాంగాన్‌లో సిక్స్ కు లాఫ్ట్, స్పిన్నర్ రిషాద్ బౌలింగ్ లో లాంగాఫ్ లోకి మరో లాఫ్ట్, తర్వాత స్లాగ్ స్వీప్ తో లాంగాన్ లోకే సిక్స్.. పేసర్ ముస్తాఫిజుర్ ఆఫ్ కటర్ ఫ్లాట్ సిక్స్ ఇలా చెలరేగిపోయాడు. టీమ్ ఇండియాకు పేస్ బౌలింగ్ ఆల్ రౌండర్ల కొరత ఉంది. శివమ్ దూబె వంటి వారున్నా అతడి బౌలింగ్ లో పేస్ ఉండదు. 125 కిలోమీటర్లకు మించి వేగం కష్టమే. హార్దిక్ పాండ్యా మాత్రం 140 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు వేయగలడు. కానీ, హార్దిక్ కు గాయాల బెడద ఉంది. ఈ నేపథ్యంలో నితీశ్ కాబోయే సూపర్ స్టార్ లా కనిపిస్తున్నాడు. బౌలింగ్ లో బుధవారం నాటి మ్యాచ్ లో 2 వికెట్లు తీసిన అతడు ఆకట్టుకున్నాడు. ప్రత్యేకించి 135 కిలోమీటర్ల వేగంతో బంతులేశాడు. దీంతోనే నితీశ్ కు మంచి భవిష్యత్ ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# రోహిత్ శర్మ అద్భుతంగా ఆడగలడు

**- రోహిత్ శర్మకు టాలెంట్ దేవుడిచ్చిన బహుమతి**

**- టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని**



భారత క్రికెట్ చరిత్రలోనే అంతర్జాతీయ వన్డేల్లో ఏకంగా మూడు డబుల్ సెంచరీలు చేసి చరిత్ర సృష్టించాడు కెప్టెన్ రోహిత్ శర్మ. 2007లో వన్డేల్లో అరంగేట్రం చేసిన రోహిత్.. మొదటి మూడు మ్యాచ్‌ల్లో మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేసేవాడు. ఆ తర్వాత అతడి నాలుగో వన్డే మ్యాచ్ నుంచి జట్టులో ఓపెనర్‌గా ఆడిన మొదటి మ్యాచ్‌లోనే 93 బంతుల్లో 83 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో రోహిత్ దూకుడు ప్రదర్శనతో భారత జట్టు 48 ఓవర్లలోనే 258 పరుగులు చేసి 3-1 తేడాతో సిరీస్‌ని దక్కించుకుంది. అయితే తాజాగా ఈ మ్యాచ్‌లో రోహిత్ ఆటతీరుని గుర్తు చేసుకున్నాడు టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ. రోహిత్ శర్మకు టాలెంట్ దేవుడిచ్చిన బహుమతి అంటూ కొనియాడాడు. 'రోహిత్ శర్మ అద్భుతంగా ఆడగలడు. అతడి ఆటతీరుకి నేను చాలా సంతోషిస్తున్నాను. అతడికి టాలెంట్ దేవుడిచ్చిన బహుమానం. ఇలాంటి ఇన్నింగ్స్ ఆడటం రోహిత్‌కి చాలా అవసరం. జట్టులో గొప్ప స్థాయికి చేరుకోవడానికి ఇలాంటి ప్రదర్శన ఆత్మవిశ్వాసాన్నిస్తుంది. వ్యక్తిగతంగా అతడు ఆడే విధానానికి నేను చాలా ఆనందంగా ఉన్నాను. అప్పుడు రోహిత్, మనోజ్ తివారిలు జట్టులో ఓపెనర్లుగా ఉన్నారు. ఇద్దరిలో ఒకరు కచ్చితంగా దూకుడుగా ఆడేవాళ్లు ఉండాలనుకున్నాం. మనోజ్ అలాంటి ప్రదర్శన చేయలేదు. కాబట్టి రోహిత్ దాన్ని సవాలుగా తీసుకున్నాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఓపెనర్‌గా మంచి ప్రదర్శనలు ఇస్తున్నాడు' అంటూ ధోనీ రోహిత్‌ను ప్రశంసించాడు. కాగా రోహిత్ 265 వన్డే మ్యాచ్‌ల్లో 10,866 పరుగులు చేశాడు. ఇదిలా ఉండగా, హిట్‌మ్యాన్ తన 16ఏళ్ల కెరీర్‌లో ఎన్నో రికార్డులు నమోదు చేశాడు. వన్డే చరిత్రలో మూడు డబుల్ సెంచరీలు చేసిన ఏకైక ఆటగాడిగా నిలిచాడు రోహిత్. 2014లో శ్రీలంకతో జరిగిన వన్డేలో అత్యధిక స్కోర్(264) చేసి రికార్డు సృష్టించాడు. 2019 వన్డే ప్రపంచ కప్‌లో ఒకే ఎడిషన్‌లో ఐదు సెంచరీలు సహా అత్యధిక సెంచరీలు(7) సాధించాడు. 241 ఇన్నింగ్స్‌లోనే 10వేల పరుగుల మార్క్‌ని అందుకున్న రెండో ఆటగాడిగా నిలిచాడు రోహిత్. కాగా నవంబర్‌లో ఆస్ట్రేలియాతో జరగనున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్ట్‌కు రోహిత్ అందుబాటులో ఉండకపోవచ్చనే వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే.

# తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ తేడాతో ఇంగ్లండ్ విజయం


**- ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో పాకిస్థాన్ ఓటమి**



పాకిస్థాన్ క్రికెట్ టీమ్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. సొంతగడ్డపై బంగ్లాదేశ్‌తో టెస్ట్ సిరీస్‌లో క్లీన్ స్వీప్ అయిన పాకిస్థాన్.. తాజాగా ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ తేడాతో చిత్తయ్యింది. ముల్తాన్ వేదికగా శుక్రవారం ముగిసిన ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ ఘోర పరాజయంతో పాకిస్థాన్ అత్యంత చెత్త రికార్డ్‌ను తమ పేరిట లిఖించుకుంది. 147 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే మరే జట్టు నమోదు చేయని చెత్త రికార్డ్‌ను తమ ఖాతాలో వేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 550 ప్లస్ రన్స్ చేసినా ఇన్నింగ్స్ తేడాతో ఓడిపోవడం టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే ఇదే తొలిసారి. అంతేకాకుండా ఇరు జట్లు తమ తొలి ఇన్నింగ్స్‌ల్లో 550 ప్లస్ రన్స్ నమోదు చేసిన సందర్భంలో ఫలితం తేలిన రెండో మ్యాచ్ కూడా ఇదే.ఇంగ్లండ్‌తోనే 2022లో జరిగిన మ్యాచ్‌లోనూ పాకిస్థాన్ 74 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. 152/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో చివరి రోజు ఆటను ప్రారంభించిన పాకిస్థాన్ మరో 68 పరుగులు మాత్రమే జోడించి రెండో ఇన్నింగ్స్‌లో 220 పరుగులకు ఆలౌటైంది. అఘా సల్మాన్(63), ఆమీర్ జమాల్(55 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించినా ఫలితం లేకపోయింది. ఆఖరి బ్యాటర్ అబ్రార్ అహ్మద్ జ్వరం కారణంగా బ్యాటింగ్‌కు రాలేదు. దాంతో అంపైర్లు పాకిస్థాన్ ఆలౌటైనట్లుగా ప్రకటించారు. ఇంగ్లండ్ బౌలర్లలో స్పిన్నర్ జాక్ లీచ్ నాలుగు వికెట్లు తీయగా.. గస్ అట్కిన్సన్, కార్సె రెండేసి వికెట్లు పడగొట్టారు. క్రిస్ వోక్స్‌కు ఓ వికెట్ దక్కింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 556 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్ 823/7 రికార్డ్ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. హ్యారీ బ్రూక్(322 బంతుల్లో 29 ఫోర్లు, 3 సిక్స్‌లతో 317) సెంచరీతో చెలరేగగా.. జో రూట్(375 బంతుల్లో 17 ఫోర్లతో 262) రికార్డ్ డబుల్ సెంచరీతో సత్తా చాటాడు. దాంతో ఆ జట్టుకు 267 పరుగుల భారీ ఆధిక్యం దక్కింది. ఇంగ్లండ్ సాధించిన ఆధిక్యాన్ని కూడా పాకిస్థాన్ అందుకోలేకపోయింది. త్రిశతకంతో సత్తా చాటిన హ్యారీ బ్రూక్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.సొంతగడ్డపై పాకిస్థాన్‌కు ఇది వరుసగా ఆరో ఓటమి కావడం విశేషం. గత 9 టెస్ట్‌ల్లో పాక్ ఏడింట్లో ఓటమిపాలైంది. మార్చి 2022 నుంచి తాజా మ్యాచ్ వరకు పాకిస్థాన్ సొంతగడ్డపై ఒక్క టెస్ట్ మ్యాచ్ గెలవలేదు. మొత్తం 11 టెస్ట్‌లు ఆడగా.. ఏడింటిలో ఓటమిపాలైంది. నాలుగు మ్యాచ్‌లు డ్రా అయ్యాయి.

# బాబర్, షాహీన్ అఫ్రిదీ మధ్య తారా స్థాయికి చేరిన విభేదాలు

పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజామ్, స్టార్ పేసర్ షాహిన్ అఫ్రిదీ మధ్య విభేదాలు తారా స్థాయికి చేరినట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరి కారణంగా పాకిస్థాన్ క్రికెట్ టీమ్ డ్రెస్సింగ్ రూమ్ రెండు వర్గాలుగా చీలినట్లు గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఆటగాళ్ల గొడవల కారణంగానే పాకిస్థాన్ జట్టు దారుణ పరాజయాలను మూటగట్టుకుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విమర్శలను పాకిస్థాన్ మేనేజ్‌మెంట్ ఎప్పటికప్పుడూ తిప్పికొడుతున్నా.. ఆటగాళ్లు మాత్రం మైదానంలోనే గొడవకు దిగుతున్నారు. తాజాగా ఇంగ్లండ్‌తో ముగిసిన తొలి టెస్ట్‌లోనూ షాహిన్ అఫ్రిదీ, బాబర్ ఆజామ్ గొడవపడినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా షాహిన్ అఫ్రిదీ.. బాబర్ ఆజామ్ బ్యాటింగ్ వైఫల్యాన్ని ప్రస్తావిస్తూ ఎగతాళి చేసినట్లు ఓ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ వీడియోలో షాహిన్ అఫ్రిది.. బాబర్ ఆజామ్‌ను ఉద్దేశించి జింబూ, జింబూ అని గట్టిగా అరుస్తున్నాడు. జింబూ అనేది బాబర్ ఆజామ్‌కు అతని హేటర్స్ పెట్టిన పేరు. బాబర్ ఆజామ్ పసికూన జట్లపైనే పరుగుల మోత మోగిస్తాడని, జింబాబ్వే వంటి చిన్నదేశాలపై మాత్రమే సెంచరీలు సాధిస్తాడని, బలమైన జట్లపై దారుణంగా విఫలమవుతాడనే అభిప్రాయం ఉంది. ఈ క్రమంలోనే కొందరు నెటిజన్లు బాబర్ ఆజామ్‌ను జింబూ అనే నిక్ నేమ్‌తో ఎగతాళి చేస్తారు. సోషల్ మీడియా వేదికగా బాబర్ ఆజామ్‌ను ట్రోల్ చేసేందుకు ఈ పదాన్ని వినియోగిస్తారు. అయితే ఈ పదాన్ని తాజాగా షాహిన్ అఫ్రిదీ వాడటం చర్చనీయాంశమైంది. ఇంకా పాకిస్థాన్ డ్రెస్సింగ్ రూమ్‌లో గొడవలు సెట్ అవ్వలేదని ఈ వీడియోతో అర్థమవుతోందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. కెప్టెన్సీ విషయంలో బాబర్ ఆజామ్, షాహిన్ అఫ్రిదికి గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ గొడవలకు పీసీబీ అనాలోచిత నిర్ణయాలు కూడా ఆజ్యం పోసాయి. వన్డే ప్రపంచకప్ 2023 పరాజయం అనంతరం బాబర్ ఆజామ్‌ను కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించారు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో షాహిన్ అఫ్రిదిని సారథిగా ఎంపిక చేశారు. అయితే ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడిన అతన్ని.. టీ20 ప్రపంచకప్ 2024 ప్రారంభానికి ముందు కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించి మళ్లీ బాబర్ ఆజామ్‌కు అప్పగించారు. దాంతో ఈ ఇద్దరి మధ్య గొడవలు తారా స్థాయికి చేరాయి. దాంతో మెగా టోర్నీలో పాక్ లీగ్ దశలోనే వెనుదిరిగాల్సి వచ్చింది. గత రెండేళ్లుగా బాబర్ ఆజామ్ దారుణంగా విఫలమవు తున్నాడు. 2022 డిసెంబర్‌లో అతను చివరిసారిగా శతకం సాధించాడు. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్ట్‌లోనూ దారుణంగా విఫలమయ్యాడు. ఈ మ్యాచ్‌లో పాకిస్థాన్ ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. తొలి ఇన్నింగ్స్‌లో 556 పరుగులు చేసినా ఘోర ఓటమిని మూటగట్టుకుంది.



# జిగ్రాలో నీ నటన అమోఘం

### - నువ్వు కేక..అలియాకు రష్మిక కితాబు



బాలీవుడ్ నటి అలియాభట్ పై నటి రష్మిక ప్రశంసల వర్షం కురిపించారు. యాక్టింగ్‌లో అలియా టాలెంట్, కథల ఎంపికను ఆమె మెచ్చుకున్నారు. విభిన్నమైన కథలను తరచూ ప్రేక్షకులకు అందిస్తున్నందుకు ధన్యవాదాలు చెప్పారు. ఈ మేరకు తాజాగా ఇన్‌స్టా స్టోరీస్ వేదికగా పోస్ట్ పెట్టారు. అలియా భట్, వేదాంగ్ నటించిన 'జిగ్రా' చూశా. సినిమా అద్భుతంగా ఉంది. నటీనటులు, చిత్రబృందాన్ని గట్టిగా హత్తుకుని మెచ్చుకోకుండా ఉండలేకపోయా. అలియా.. నువ్వు మాకు దొరకడం ఓ వరం. నీ టాలెంట్‌ని చూసే అవకాశం మాకు ఇచ్చినందుకు థాంక్యూ. వేదాంగ్ నువ్వు మరెన్నో చిత్రాలు నటిస్తే చూడాలనుకుంటున్నా. రాహుల్.. నువ్వు నన్నెంతో సర్‌ప్రైజ్ చేశావు. నీకు, 'జిగ్రా'లో నువ్వు పోషించిన మత్తు పాత్రకు చాలా వ్యత్యాసం ఉంది. వాసన్ బాలా.. మేకింగ్ చాలా బాగుంది. ఇంకెన్నో విషయాలు చెప్పాలని ఉంది. చిత్రబృందం మొత్తానికి నా అభినందనలు అని రష్మిక రాసుకొచ్చారు. బాలీవుడ్ నటీనటులు అలియాభట్ , వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జిగ్రా' యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి వాసన్ బాలా దర్శకత్వం వహించారు. కరణ్ జోహార్ నిర్మాత. తమ్ముడు కోసం అక్క చేసే పోరాటం నేపథ్యంలో ఇది సిద్ధమైంది. శుక్రవారం ఈ సినిమా ప్రేక్షకుల ముందుకువచ్చింది. సినీ తారల కోసం ముంబయిలో 'జిగ్రా' స్పెషల్ షో వేశారు. దీనికి రష్మిక హాజరైన విషయం తెలిసిందే. ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రానా తెలుగులో ఈ చిత్రాన్ని విడుదల చేశారు. సినిమా విడుదల సందర్భంగా మహేశ్‌బాబు చిత్రబృందానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు.


# రొటీన్ కథల నుంచి బయటపడని శ్రీనువైట్ల

### - విశ్వం మూవీలో కనిపించని కొత్తదనం




నటుడు గోపీచంద్.. దర్శకుడు శ్రీను వైట్ల ఇద్దరూ కొన్నాళ్లుగా వరుస పరాజయాలతో సతమతమవుతున్న క్రమంలో... ఇప్పుడీ ఇద్దరూ కలిసి విజయమే లక్ష్యంగా 'విశ్వం'తో విజయదశమి బరిలో నిలిచారు. ఇది వీళ్ల కాంబోలో తొలి సినిమా. ఇప్పటికే దీనిపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అసలు కథేంటంటే.. జలాలుద్దీన్ ఖురేషి (జిషు సేన్) కరుడుగట్టిన ఐఎస్ఐ టెర్రరిస్ట్. సంజయ్ శర్మ అనే మారుపేరుతో భారత్‌లో నివసిస్తూ.. విద్యా వ్యవస్థ ముసుగులో విద్యార్థుల్ని తీవ్రవాదులుగా తయారు చేస్తుంటాడు. వాళ్ల సాయంతో పెద్ద ఎత్తున మారణహోమం సృష్టించి భారత్‌ను నాశనం చేయాలని ప్రణాళిక రచిస్తుంటాడు. దీనికోసం కేంద్రమంత్రి సీతారామరాజు (సుమన్) సోదరుడైన బాచిరాజు (సునీల్) సాయం తీసుకుంటాడు. కానీ, తన ఉగ్రచర్యల సంగతి సీతారామరాజుకు తెలియడంతో బాచిరాజుతో కలిసి అతన్ని జలాలుద్దీన్ కిరాతకంగా చంపేస్తాడు. ఈ హత్యను దర్శన అనే ఓ చిన్న పాప చూస్తుంది. దీంతో ఆ పాపను కూడా చంపాలని బాచిరాజుతో చెప్పి ఓ పని మీద కశ్మీర్‌కు వెళ్తాడు జలాలుద్దీన్. అయితే బాచిరాజు ముఠా ఆ పాపను చంపబోగా ఆ చిన్నారి కుటుంబానికి గోపిరెడ్డిగా పరిచయమైన విశ్వం (గోపీచంద్) కాపాడతాడు. శ్రీను వైట్ల చిత్రాల్లో కథలు ఓ థీమ్‌లో సాగుతుంటాయి. దేశానికి కొన్ని విద్రోహ శక్తుల నుంచి ముప్పు ఏర్పడటం.. ఆ కుట్రల్ని భగ్నం చేసేందుకు హీరో తన ఐడింటిటీని దాచి పెట్టి మారుపేరుతో ఓ ఇంటిలో చేరి రహస్యంగా మిషన్‌ను చేపట్టడం.. ఈ క్రమంలో తన తెలివితేటలతో ఆ విద్రోహ శక్తుల్ని తన ట్రాప్‌లో పడేలా చేసి వాళ్ల ఆట కట్టించడం కనిపిస్తుంటుంది. శ్రీను వైట్ల నుంచి వచ్చిన 'దూకుడు', 'బాద్‌షా' చిత్రాలు ఈ కోవకు చెందినవే. ఈ థీమ్ రొటీన్‌గా మారిపోవడంతో శ్రీనుకు వరుస పరాజయాలు ఎదురయ్యాయి. అందుకే ఈసారి తన పంథాను పూర్తిగా మార్చుకుని.. ఈతరం ప్రేక్షకులు కోరుకునే కొత్తదనం నిండిన కథతో 'విశ్వం'ను సిద్ధం చేసినట్లు ప్రచార కార్యక్రమాల్లో చెప్పారు. కానీ, తెరపై సినిమా చూస్తున్నప్పుడు ఆయన ఇంకా తన పాత పంథా నుంచి అసలు బయటకు రాలేదనే అనిపిస్తుంది. ఈ చిత్రాన్ని ఒక్క ముక్కలో చెప్పాలంటే 'దూకుడు'కు గోపీచంద్ వెర్షన్‌లా ఉంటుంది. మహేశ్‌బాబు 'దూకుడు'లో తండ్రి ఎమోషన్‌ను కనిపిస్తే.. ఇందులో ఓ పాప ఎమోషన్ కీలకంగా నిలుస్తుంది. మిగతాదంతా శ్రీను వైట్ల మార్క్ వినోదం.. గోపీచంద్ శైలి యాక్షన్ హంగామాతో రొటీన్‌గానే సాగిపోతుంది. ద్వారకలో జరిగే బాంబు బ్లాస్ట్ ఎపిసోడ్‌తో సినిమా ఆసక్తికరంగా మొదలవుతుంది. ఆ వెంటనే జలాలుద్దీన్ పాత్రను పరిచయం చేసి నేరుగా కథలోకి తీసుకెళ్లిపోయారు దర్శకుడు. కథలో సీరియస్‌నెస్ మిస్సయి పోతుంది. ఇక్కడి నుంచి శ్రీను వైట్ల మార్క్ వినోదం మొదలవుతుంది. జాలిబాబుగా పృథ్వీ చేసే అల్లరి.. మ్యారేజ్ బ్రోకర్‌గా శ్రీనివాస్ కామెడీ ట్రాక్ ప్రేక్షకులకు నవ్వులు పంచుతాయి. ఇక నాయకా నాయికల మధ్య వచ్చే ఇటలీ లవ్‌ట్రాక్ ఎపిసోడ్ బోరింగ్‌గా అనిపిస్తుంది. పాపను చంపేందుకు బాచిరాజు మళ్లీ కుట్ర మొదలు పెట్టినప్పటి నుంచి కథలో సీరియస్‌నెస్ మొదలవుతుంది. ఈ క్రమంలో గోవా నేపథ్యంలో వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌తో విరామమిచ్చిన తీరు ఆసక్తిరేకెత్తిస్తుంది. గోపీచంద్ ఎప్పటిలాగే తనకు అలవాటైన యాక్షన్ పాత్రలో చక్కగా ఒదిగిపోయారు. యాక్షన్, కామెడీ సీక్వెన్స్‌లలో తనదైన శైలిలో చెలరేగి పోయారు. కావ్య థాపర్ తెరపై తన అందచందాల తో గ్లామర్‌గా కనిపించింది. తన పాత్ర నిడివి కూడా ఎక్కువగా ఉంటుంది. డ్యాన్సుల్లో ప్రతిభ చూపే అవకాశం దొరికింది. కాకపోతే నటన పరంగా ప్రతిభ చూపించుకునే ఛాన్స్ దొరకలేదు. ప్రధాన ప్రతినాయకుడిగా జిషు సేన్ గుప్తా అలవాటైన విలనిజంతో ఆకట్టుకున్నాడు. సునీల్‌ను ఒకటి రెండు సీన్స్ మినహా ఆద్యంతం కామెడీ విలన్‌గానే చూపించారు. ఈ కథకు కీలకమైన దర్శన పాత్రను పోషించిన చిన్నారి చక్కటి నటనతో ఆకట్టుకుంది. నరేశ్, ప్రగతి, వెన్నెల కిషోర్, పృథ్వీ, వీటీవీ గణెళిశ్, అజయ్ ఘోష్.. ఇలా బోలెడంత మంది కమెడియన్లు కనిపించారు. వీరిలో ప్రతి ఒక్కరూ వాళ్ల పాత్ర పరిధి మేరకు నవ్వించే ప్రయత్నమే చేశారు. కమర్షియల్ డైరెక్టర్‌గా శ్రీను వైట్ల ప్రతిభకు వంక పెట్టాల్సిన పనిలేదు. కాకపోతే తన రొటీన్ కమర్షియల్ ఫార్మాట్ నుంచి బయట పడటం లేదు. రచయిత గోపీమోహన్ కూడా ఒకే థీమ్‌ను పట్టుకుని బండి నడిపిస్తున్నట్లు అనిపిస్తోంది. కథ.. కథనాల్లో కొత్తదనం చూపించలేకపోతున్నారు. చైతన్ భరద్వాజ్ సంగీతం పర్వాలేదనిపిస్తుంది. భీమ్స్ చేసిన 'గుంగురూ గుంగురూ' పాట మాస్ ప్రేక్షకుల్ని అలరిస్తుంది. విజువల్స్ గ్రాండ్‌గా ఉంటాయి. ఇలాంటి రొటీన్ కథను నమ్మి భారీగా ఖర్చు పెట్టిన నిర్మాతల సాహసాన్ని మెచ్చుకోవాలి.

# స్వయంభూ సెట్‌లో.. ఆయుధపూజ




నిఖిల్ కథానాయకుడిగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'స్వయంభూ'. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సోషియో ఫాంటసీ కథాంశంతో ఇది సిద్ధమవుతోంది. భారీ బ్జడెట్‌తో ప్రతిష్ఠాత్మకంగా చిత్రబృందం దీనిని రూపొందిస్తోంది. దేవీ నవరాత్రులను పురస్కరించుకొని తాజాగా ఈ సినిమా సెట్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. సినిమాలో ఉపయోగిస్తోన్న ఆయుధాలన్నింటికీ పూజ చేశారు. దీనికి సంబంధించిన స్పెషల్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. దసరా శుభాకాంక్షలు తెలియజేసింది.

# దేవర-2 మరికొందరు బాలీవుడ్ స్టార్స్




ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దేవర'ఇటీవల విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. దీంతో దీని సీక్వెల్‌కు సంబంధించిన అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా ప్రచారంలో భాగంగా దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'దేవర2' గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఈ సీక్వెల్‌లో మరికొందరు బాలీవుడ్ స్టార్స్ ఉండే అవకాశం ఉందన్నారు. ఇది జరుగుతుందో, లేదో నాకు తెలియదు కానీ.. 'దేవర2'లో రణ్‌వీర్ సింగ్, రణ్‌బీర్ కపూర్ ఉంటే బాగుంటుంది. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. ఇది జరుగుతుందో, లేదో తెలియకుండా నేను ఎక్కువ వివరాలు పంచుకోకూడదు. తెలుగు, తమిళ ఇండస్ట్రీలకు చెందిన నటీనటుల పేర్లు చెబితే ఇప్పటినుంచే ఊహాగానాలు మొదలవుతాయి. 'దేవర2'లో అతిథి పాత్రలు కూడా ఉంటాయి. అవి సినిమాలో చాలా కీలకమైనవి. అతి త్వరలోనే వాటి వివరాలు ప్రకటిస్తాను అని కొరటాల శివ అన్నారు.'దేవర 2'పై కొరటాల ఎప్పటికప్పుడు అంచనాలు పెంచేస్తున్నారు. మొదటిభాగం కంటే రెండోభాగం చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని ఇటీవల వెల్లడించారు. పార్ట్ 1లో చూసింది 10 శాతమేనని.. రెండో భాగంలో 100శాతం చూస్తారన్నారు. ప్రతీ పాత్రలో ట్విస్ట్ ఉంటుందని చెప్పారు .ఎన్టీఆర్ కూడా ఈ సీక్వెల్ గురించి మాట్లాడుతూ.. మొదటి భాగం విజయం సాధించడంతో తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు. 'దేవర' కంటే దాని సీక్వెల్ ఇంకా బాగుంటుందన్నారు.


# పట్టాలకు ఎక్కని వేణు మూవీ

### -దిల్‌రాజ్ దయతలిస్తేనే ముందుకు...



నటుడిగా, కామెడీయన్‌గా మంచి గుర్తింపు పొందిన ఆర్టిస్ట్ వేణు యేల్దండి. జబర్దస్త్ షోతో స్టార్ కామెడీయన్‌గా ఎదిగిన వేణు.. 'బలగం' సినిమా తీసి అందరిని ఆశ్చర్యపరిచాడు. తెలంగాణ మాండలికం, ఎమోషనల్ స్టోరీ నేరేటివ్‌తో తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలని కట్టిపడేసాడు. దీంతో ఆయన నెక్ట్స్ సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సినిమా రిలీజై రెండేళ్లవుతున్నా.. ఇంకో ప్రాజెక్ట్ షూట్ ప్రారంభించకపోవడంతో అసలేమైందని చర్చ జరుగుతోంది. కథను ఇప్పటికే ఇద్దరు స్టార్ హీరోలకు నేరేట్ చేసిన వాళ్ళమేన్నారు.. ప్రొడ్యూసర్ దిల్ రాజు ఏమన్నాడంటే.. వేణు యేల్దండి.. తన బలగం సినిమాతో తెలుగు సినీ ఇండస్ట్రీలో సంచలనమే సృష్టించాడు. ఈ సినిమాకి ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన దిల్ రాజే నెక్ట్స్ సినిమాకి కూడా కమిట్మెంట్ ఇచ్చాడు. దీంతో 'ఎల్లమ్మ' కథ ఆధారంగా వేణు ఒక స్క్రిప్ట్ కూడా రెడీ చేసుకున్నాడు. మొదట ఈ స్టోరిని నేచురల్ స్టార్ నాని కి నేరేట్ చేసినట్లు వార్తలొచ్చాయి. అయితే కథ నచ్చకో, డేట్స్ కాళీలేకో నాని ఈ సినిమాని యాక్సెప్ట్ చేయలేదని టాక్ వినపడింది. బేసిక్‌గా ప్రయోగాత్మక, ఉత్తమ కథాదీరిత సినిమాలు చేసే నాని ఇలా చేశాడేంటని అంతా అనుకున్నారు. దీంతో వేణు ఈ కథను హీరో నితిన్‌కి వినిపించారట. స్టోరీ నచ్చిన నితిన్ ఈ ప్రాజెక్ట్ ఓకే చేశాడని కూడా సినీ వర్గాల్లో టాక్. బేసిక్‌గా దిల్ రాజు ప్రొడక్షన్ అంటే నితిన్ నో చెప్పే ఛాన్సే లేదంటున్నారు. ఇదిలా ఉండగా గురువారం జరిగిన ఓ సినిమా మీటింగ్‌కి డైరెక్టర్ వేణుతో పాటు నిర్మాత దిల్ రాజు కూడా అటెండ్ అయ్యాడు. ఈ నేపథ్యంలో దిల్ రాజు మాట్లాడుతూ.. ' ఏం వేణు ఎల్లమ్మ కథ ఎప్పుడు మొదలు పెడుతున్నావు' అని ప్రశ్నించాడు. దీనికి వేణు స్పందిస్తూ.. మీరెప్పుడంటే అప్పుడే సార్ అన్నారు. ఈ నవంబర్‌లో షూట్ స్టార్ట్ చేద్దామా అన్నారు. దీనికి దిల్ రాజు నవ్వుతూ.. వద్దు ఫిబ్రవరిలో స్టార్ట్ చేద్దాము అంటూ సమాధానమిచ్చారు. దీంతో అనఫీషియల్‌గా ఈ ప్రాజెక్ట్‌కి హీరో సెలెక్ట్ అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాబిన్‌హుడ్, తమ్ముడు సినిమాలతో బిజీగా ఉన్న నితిన్ ఈ ప్రాజెక్ట్ చేయనున్నట్లు టాక్.

# హీరోయిన్‌తో ప్రేమలో పడ్డ నారా రోహిత్




తొలి సినిమా 'బాణం'తోనే ప్రేక్షకులని ఆకట్టుకున్న హీరో నారా రోహిత్. ప్రతినిధి సినిమాతో ఆడియెన్స్‌కి మంచి కిక్కిచ్చిన రోహిత్.. ఆ మూవీ సీక్వెల్ ప్రతినిధి 2తో మాత్రం నిరాశపరిచాడు. ఇదంతా పక్కన పెడితే ఇండస్ట్రీలోని మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్స్‌లో రోహిత్ ఒకరు. తాజాగా ఆయన పెళ్ళికి సంబంధించిన అప్డేట్ ఒకటి సందడి చేస్తుంది. అది కూడా ఒక హీరోయిన్‌ని ప్రేమించి పెళ్లిచేసుకోనున్నట్లు సమాచారం. సాక్షాత్ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తమ్ముడి కుమారుడైన రోహిత్ ఇండస్ట్రీలో మంచి సినిమాలతో ఫర్వాలేదనిపిస్తునాడు. భారీ హిట్లు లేకపోయినా డిజాస్టర్ కథలు కూడా తీయకపోవడంతో కెరీర్ సాఫీగానే సాగుతోంది. అయితే వయసు మాత్రం నాలుగు పదులు దాటడంతో పెళ్లి చేసేయాలని నారా ఫ్యామిలీ ఫిక్స్ అయిపోయిందంట. అంతే కాదు త్వరలోనే పెళ్ళికి ముహర్తం కూడా ఫిక్స్ చేశారు. ఈ నెల 13నే ఎంగేజ్మెంట్. ప్రతినిధి 2 సినిమాలో హీరోయిన్‌గా చేసిన 'సిరి' ని రోహిత్ ప్రేమించాడట. ఈ జంట పెళ్లి చేసుకోవడానికి కూడా సిద్ధపడటంతో వధువుని ప్రత్యేకంగా వెతికే పని లేకుండా చేశావు అంటూ నారా ఫ్యామిలీ ఖుషి అవుతోంది. ప్రస్తుతం ఈయన ప్రతినిధి 2 సినిమా ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది. టీజర్, ట్రైలర్‌లతోనే మంచి హైప్ తెచ్చుకున్న ఈ మూవీ కొన్నాళ్లు చర్చల్లో బాగా నిలిచింది. అయితే సీఎం మరణం.. అతని కొడుకుని సీఎం చేయాలని పట్టుబట్టడం.. సంక్షేమ పథకాలపై సెటర్లు.. అభివృద్ధి జరగలేదనే విమర్శలు.. ఇవన్నీ అధికార వైసీపీ పార్టీకి కనెక్ట్ అయ్యే అంశాలుగా ఉన్నా.. కథ పరంగా ఆ పార్టీని కెలికే ప్రయత్నం అయితే చేయలేదు. కేవలం సీఎం మర్డర్ మిస్టరీ చుట్టూ పొలిటికల్ డ్రామా మాత్రమే చూపించారు.